క్లుప్తంగా...

పోలింగ్ శాతాన్ని పెంచాలి



ర్యాలీలో పాల్గొన్న మహ్మద్ సలావుద్దీన్ లోధీ

చార్మినార్: ఎన్నికల్లో అందరూ తమ ఓటును వినియోగించుకుని పోలింగ్ శాతాన్ని పెంచాలని బీఆర్ఎస్ చార్మినార్ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్–9 ఆధ్వర్యంలో శనివారం పాతబస్తీ మొఘల్‌పురా నుంచి ఓట్ ఫర్ ష్యూర్ పేరిట ర్యాలీ నిర్వహించారు. చార్మినార్, గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టి, మదీనా సర్కిల్ ద్వారా తిరిగి మొఘల్‌పురాలోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ కొనసాగింది. సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ డీడీ నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తమ సర్కిల్ పరిధిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు

అబిడ్స్: బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. గోషామహల్‌లోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. మైనార్టీలతోపాటు అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపే మొగ్గుచూపుతున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గోషామహల్‌లో బీఆర్ఎస్‌దే విజయమన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల్ అహ్మద్, అన్వార్ అజారీ, అషు, అనిత, అనిల్‌కుమార్, శంకర్ సింగ్ జమేదార్, ఆస్మా బేగం, సాయి పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ ఇంటికెళ్లడం ఖాయం'



గౌరీ సతీష్

అబిడ్స్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ ప్రభజనంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటికి పోవడం ఖాయమని రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఇస్తే బీఆర్ఎస్ పార్టీ ప్రజలను పలు విధాలుగా వేధిస్తూ అవినీతి పాలన సాగిస్తుందన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కర్ణాటక తరహాలో తెలంగాణలో సైతం కాంగ్రెస్ పార్టీ భారీ ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్‌గా పనిచేస్తూ కేంద్రంలోని ఎన్‌డీఏ తొత్తుగా వ్యవహరిస్తుందని గౌరీ సతీష్ అన్నారు.

అర్హులందరూ ఓటును వినియోగించుకోవాలి



5కే రన్‌లో పాల్గొన్న డీసీ రాజేందర్‌రెడ్డి

బహదూర్‌పురా: అర్హులందరూ ఓటును వినియోగించుకోవాలని జీహెచ్ఎంసీ ఫలక్‌నుమా డిప్యూటీ కమిషనర్ రాజేందర్‌రెడ్డి అన్నారు. కిషన్‌బాగ్ నుంచి ఫతేదర్వాజా వరకు 5కే రన్ నిర్వహిస్తూ ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తమ పేర్లను ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కిషన్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ హుస్సేనీ పాషా తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రభుత్వ ఉద్యోగి మృతి

నాంపల్లి: భార్యా పిల్లలు దూరమయ్యారనే మనోవేదనతో పాటు నిత్యం బయటి ఆహారం తీసుకోవడంతో అనారోగ్యానికి గురైన ఓ ప్రభుత్వ ఉద్యోగి మృత్యువాత పడిన ఘటన నాంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సైఫాబాద్ ఏజీ ఆఫీస్‌లోని అకౌంటెంట్ జనరల్ కార్యాలయంలో పనిచేసే శ్యామ్‌విజయ్ (58) నాంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని మాధుర్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. గత కొంతకాలంగా మధుమేహం వ్యాధితో బాధపడుతున్నారు. ఈ నెల 15న తన ఫ్లాట్‌లో శ్యామ్ విజయ్ అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. పాలు సరఫరా చేసే వ్యక్తి వచ్చి తలుపులు కొట్టగా ఎంతసేపటికి తెరువకపోవడంతో అదే ఫ్లాట్‌లో ఉండే వారికి అనుమానం రాగా రిటైర్డ్ ఏసీపీ చక్రపాణి సహాయంతో తలుపులు తెరిచి చూడగా మంచం మీద నిస్సహాయ స్థితిలో పడి ఉన్నారు. ఫ్లాట్ మొత్తం దుర్గంధం వస్తోంది. 108లో నాంపల్లి కేర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం తిరిగి అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. వ్యాధి తీవ్రత కావడంతో 19న శ్యామ్ విజయ్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మధుమేహంతో బాధపడుతూ మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- నత్తనడకన అభివృద్ధి పనులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



మ్యాన్‌హోల్‌లో పడిన ద్విచక్ర వాహనదారుడిని కాపాడుతున్న స్థానికులు

చార్మినార్: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కొత్తగా చేపడుతున్న అభివృద్ధి పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో స్థానికులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ, కచ్చామోరీ పనులను దీర్ఘకాలంగా పెండింగ్ పెడుతున్నారు. మరమ్మతు పనులను ప్రారంభించిన వెంటనే పూర్తి చేయకపోతుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. క్షేత్ర స్థాయిలో ఏ మేరకు పనులు జరుగుతున్నాయనే విషయాలను సంబంధిత అధికారులు పరిశీలించడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారంగా కాలయాపన చేస్తున్నారు. దీంతో తవ్వి వదిలేసిన రోడ్లతో పాటు రోడ్లపై తీసిన మ్యాన్‌హోల్ మూతలు, గోతులు ప్రమాదకరంగా మారుతున్నాయి.

ప్రమాదకరంగా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు..

చార్మినార్ జోన్ పరిధిలోని సంతోష్‌నగర్ సర్కిల్–7 లోని కుర్మగూడ బస్తీలో కొత్తగా రోడ్డు నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ తవ్వి వదిలేశారు. కొత్తగా రోడ్డు వేయడం కోసం పాత రోడ్డును పూర్తిగా తొలగించడంతో పాటు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను సైతం తొలగించారు. రోడ్డు వేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అటు వైపు నుంచి వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు ప్రమాదావశాత్తు గుంతలో పడిపోయాడు. స్పందించిన ఇతర వాహనదారులు, స్థానికులు గుంతలో పడిన వాహనదారుడిని కాపాడారు. బస్తీలోని ప్రధాన రోడ్డులో ప్రమాదకరంగా మారిన రోడ్డు నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేసి మ్యాన్‌హోళ్లకు మూతలు బిగించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు కార్యాలయాలకే పరిమితం

జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందో వారికి తెలియడం లేదు. దీంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. పాతబస్తీలోని అంతర్గత రోడ్డులో కొన్ని రోజులుగా జరుగుతున్న మరమ్మతు పనుల్లో చాలా జాప్యం జరుగుతోంది. అంతేకాకుండా తవ్వి వదిలేసిన గుంతలో వాహనదారులు ప్రమాదావశాత్తు పడుతున్నందున వెంటనే పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కమల్‌రాయ్ తదితరులు



ఫొటో ఎగ్జిబిషన్‌ను వీక్షిస్తున్న మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్

విజయనగర్‌కాలనీ: కళలు మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని ప్రాక్సిస్ స్టూడియో సీఈఓ శ్రీధర్‌రాజు అన్నారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఫొటోగ్రఫీ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన అన్నపూర్ణ కాలేజీ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా, సినిమాటోగ్రఫీ విభాగాధిపతి సిస్లా వీఎంకేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఫొటోగ్రఫీ విభాగాధిపతి ఏఆర్.కమల్‌రాజ్ మాట్లాడుతూ.. క్షణంలో అదృశ్యమయ్యే దృష్యాలను తమ కెమెరాలలో బంధించి ప్రపంచానికి చూపించే అద్భుతమైన కళ ఫొటోగ్రఫీ అని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఈనెల 23 వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తిలకించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

హై ఆక్టేన్ సంస్థ ఆధ్వర్యంలో..

నాంపల్లి: హై ఆక్టేన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలు నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాయా చిత్ర ప్రదర్శనను ప్రదర్శించారు. మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలో అమర్చిన ఫొటోలను ఆయన వీక్షించి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

యువతిని మోసం చేసిన జబర్దస్త్ కమెడియన్

జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు

వెంగళరావునగర్: ప్రేమించానని నమ్మించి శారీరకంగా కలిసి అనంతరం తప్పించుకుని తిరుగుతున్న ప్రేమికుడిపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. తొలుత ఈ యువకుడిపై గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు అయింది. కాగా ఆ ఎఫ్ఐఆర్‌ను మధురానగర్‌కు బదిలీ చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జబర్దస్త్ షోలో కమెడియన్‌గా ఉన్న నవ సందీప్ 2018లో ఓ యువతితో పరిచయం అయింది. వాట్సాప్‌లో చాటింగ్ చేస్తూ మరింత దగ్గర అయ్యాడు. విషయం అమ్మాయి ఇంట్లో తెలియడంతో కట్టడి చేశారు. కాగా ఆమెను నగరానికి రప్పించుకున్నాడు. తల్లిదండ్రులకు చెప్పకుండా షేక్‌పేటకు వచ్చి అల్ హమారా కాలనీలో నాలుగేళ్లుగా ఉంటుంది. ఈ క్రమంలో ఆమెను అనేకమార్లు అమీర్‌పేటలోని ఓయో రూముకు తీసుకెళ్లి తన కోర్కెను తీర్చుకున్నాడు. అనంతరం పెళ్లి చేసుకోమని ఆమె అడగ్గా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో ఆమె తాను మోసపోయానని తెలుసుకుని గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ పోలీసులు అతనిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి శనివారం మధురానగర్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'సమస్య పరిష్కరించేంత వరకు సమ్మె విరమించం'



డీఎంహెచ్‌లో ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు వనజ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావుతో జరిగిన చర్చలు విఫలమైనట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ వెల్లడించారు. రెగ్యులర్ చేయాలని ఏకైక డిమాండ్‌తో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె చేస్తుండగా ప్రభుత్వం మాత్రం నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు వారి డిమాండ్లనన్నింటినీ అలసత్వం చేస్తుందని వారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో జోక్యం చేసుకుని ఉంటే దేశం మొత్తంలో ఒకే రకమైన జీతాలు ఉండేవన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి నర్సింహ, వనజ మధురిమ, విజయకుమారి, పద్మ, సువర్ణ, రాజేష్‌కన్న తదితరులు పాల్గొన్నారు.

ఘర్ వాపసీతో స్వధర్మంలోకి ఆహ్వానం



మాట్లాడుతున్న సురేందర్ రెడ్డి

సుల్తాన్‌బజార్: మతం మారిన హిందువులందరినీ స్వధర్మంలోకి ఆహ్వానిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కోఠిలోని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సృష్టిలో హిందుత్వం ఎంతో పురాతనమైనదని, అత్యంత పవిత్రమైనదని పేర్కొన్నారు. రకరకాల ప్రలోభాలు, అనేక కారణాల వల్ల మతమార్పిడి వ్యవస్థను ప్రోత్సహిస్తునారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రామాంజనేయులు, తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బడేటీ వనజ, ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమా, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీహెచ్ విజయకుమారి, రాష్ట్ర నాయకురాలు జక్కుల పద్మ, అరుణ, సువర్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య గురువు తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమి చైర్మన్ దీపికారెడ్డి విష్యురాలు కీర్తన, నమ్రత కూచిపూడి నృత్య రంగ ప్రవేశం దీపాంజలి సంస్థ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో జరిగింది. ఈ సందర్భంగా గణేష పంచరథం, భామ ప్రవేశ దరువు, శివ శివ భవ భవ శరణం, థిల్లాన వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనురాధ, సినీనటుడు తనికెళ్ల భరణి, శ్రీవిద్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌వర్మపై చర్యలు తీసుకోండి



అఫీజుద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎం ముజీబ్ హుస్సేని, కేఆర్.రాజ్‌కుమార్

అబిడ్స్: ఆర్ అండ్ బీ శాఖలో ఉద్యోగులను, మహిళా ఉద్యోగులను వేధిస్తున్న సూపరింటెండెంట్ శంకర్‌వర్మపై చర్యలు తీసుకోవాలని టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని డిమాండ్ చేశారు. అసెంబ్లీ డివిజన్‌లో శంకర్‌వర్మ కూర్చుంటూ మహిళా ఉద్యోగులతో అసభ్యంగా మాట్లాడుతున్నారని, మిగతా ఉద్యోగులను వేధిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజినీర్ కార్యాలయాన్ని ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ముట్టడించి ఆందోళన చేశారు. పర్యవేక్షక ఇంజినీర్ అఫీజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులను, పలు విభాగాల ఉద్యోగులను వేధిస్తున్న శంకర్‌వర్మపై శాఖపరమైన విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. సహా అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కుద్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, బి.శంకర్, శ్రీధర్, ముఖీమ్, జనార్దన్, పూర్ణచందర్, యూనిట్ అధ్యక్షురాలు లలితరాణి, మురారి, సలీం, ఇబ్రహీం, జలీల్, తూంకుంట రాజు, శ్రీధర్, ఉల్దాపాల్, రామరాజు పాల్గొన్నారు.



వైభవంగా తీజ్ సంబరాలు

చార్మినార్: సిటీ కాలేజీలో శనివారం తీజ్ సంబరాలు వైభవంగా జరిగాయి. కాలేజీలోని గిరిజన విద్యార్థులు తమ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా తీజ్ వేడుకలను నిర్వహించారు. ఈ సంబరాల్లో మాజీ ఎంపీ రవీందర్‌నాయక్, సీతారాం నాయక్, డాక్టర్ శంకర్‌నాయక్, సేవాలాల్ శీను, అజ్మీరా సుజాత, డాక్టర్ శుక్ల, డాక్టర్ యాదయ్య, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

బహదూర్‌పురా: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని బహదూర్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌కు చెందిన షేక్ రియాజ్(24), షేక్ కలీం(22) ఒకే కంపెనీలో క్యాబ్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. విలాసవంతమైన జీవితాలను గడపేందుకు గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ధూల్‌పేట్‌లో గంజాయి కొనుగోలు చేసి బయట విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే బహదూర్‌పురాలో తౌఫిక్ అనే వ్యక్తికి గంజాయి విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం అందుకున్న బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, అదనపు ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి 1190 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు.

26న జాతీయ స్థాయి సంగీత నృత్య పోటీలు

నాంపల్లి: నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో 48వ జాతీయ స్థాయి సంగీత నృత్య పోటీలను ఈ నెల 26వ తేదీ నుంచి వారం రోజుల పాటు హైదరాబాదులో నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె.వి.రమణాచారి, నవ్య నాటక సమితి ప్రతినిధులు వేమరాజు విజయ్‌కుమార్, నిష్ఠల సుధామాల జి.వసుంధరలు తెలియజేశారు. శనివారం నాడిక్కడ మాసబ్‌ట్యాంక్‌లోని డాక్టర్ కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో జరిగిని విలేకరుల సమావేశంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను డాక్టర్ కె.వి.రమణాచారి ఆవిష్కరించి ప్రసంగించారు.

వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వర్షాకాలంలో విద్యుత్ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకి మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వర్షాకాలంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. బక్తాత్ కాలనీ నాలా, శాతం చెరువు తదితర ప్రాంతాల్లో విద్యుత్ తీగలకు మరమ్మతులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఎప్పుడో ధ్వంసమైపోయిందని కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. మరికొన్ని చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు జంతువులకు ప్రమాదగంటికలు మోగిస్తున్నాయని ఆయన అన్నారు. ఉన్నతాధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా తరచూ క్షేత్రస్థాయి పరిశీలనలు చేస్తుండాలని ఆయన కోరారు. కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తుండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసస్ లిమిటెడ్ అధికారిణి సావిత్రీసింగ్, విద్యుత్ శాఖ డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి



సరితను సన్మానిస్తున్న పూజారులు

చాంద్రాయణగుట్ట: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నాయకురాలు చెన్నయ్యగారి సరిత అన్నారు. ఫలక్‌నుమాలోని కాళిమాత ఆలయాన్ని ఆమె దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫలక్‌నుమా కాళిమాత ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ భక్తులు తరలివస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సాయితేజ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణలో మైత్రి కమిటీ సభ్యుల పాత్ర కీలకం

గోల్కొండ: స్థానికుల పండగలు, ఉత్సవాల నిర్వహణలో పోలీసులకు మైత్రి కమిటీ సభ్యులు అందిస్తున్న సహకారం ఎంతో విలువైందని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గోల్కొండ ఆషిర్‌ఖానా మాతం ఏర్పాట్లను శనివారం ఆయన మైత్రి కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట ప్రముఖ న్యాయవాది, మైత్రి కమిటీ సభ్యుడు మిర్జా ఎక్బాల్ అహ్మద్, ఎం.ఏ.బేగ్ తదితరులున్నారు.



మైత్రి కమిటీ సభ్యులతో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

'డబుల్' ఇళ్ల పంపిణీలో సమగ్ర సర్వే చేయాలి



రిలే నిరాహార దీక్షలో ప్రసంగిస్తున్న మల్లు లక్ష్మీ

చాంద్రాయణగుట్ట: పాతబస్తీలో డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించిన సర్వేను జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు పారదర్శకంగా నిర్వహించి నిజమైన పేదలకు అందించాలని సీపీఎం రాష్ట్ర నాయకురాలు మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. పేదల సమస్యలను పరిష్కరించడంతో పాటు డబుల్ బెడ్ రూం ఇళ్ల విషయమై శనివారం సీపీఎం ఆధ్వర్యంలో బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పిన సీఎం మాటలు ఇప్పటి వరకు నెరవేరలేని పరిస్థితి నెలకొందన్నారు. కోటిరెడ్డి, లక్ష్మమ్మ, సత్తార్, కృష్ణా నాయక్, బాబర్ ఖాన్, శశికళ, కిషన్, రాంకుమార్, శ్రీను, రాజేష్, నూర్జహాన్, ఫిర్దోస్, జావిదా బేగం, భాను బేగం పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో బల్దియా అధికారుల పర్యటన

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్‌లో రోడ్ల అభివృద్ధికి బల్దియా కమిషనర్‌ను కలిసి నిధులు మంజూరు చేయాలని కోరామని గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్ అన్నారు. శనివారం ఆయన బల్దియా జోనల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావుతో కలిసి గుడిమల్కాపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ఫిర్యాదు స్పందించిన బల్దియా కమిషనర్ రోడ్ల అభివృద్ధికి రూ.50లక్షలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. అంతే కాకుండా గుడిమల్కాపూర్‌లో పర్యటించడానికి జోనల్ కమిషనర్‌ను పంపించడం జరిగిందన్నారు. డీసీఎం అంజనేయులు, బల్దియా అధికారులు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌తో బంగారి ప్రకాష్ తదితరులు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



టప్పా మైసమ్మ ఆలయంలో ప్రారంభమైన కార్యక్రమాలు

గోల్కొండ: కార్వాన్‌లోని టప్పా మైసమ్మ ఆలయంలో దేవత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో మొదటి రోజు శనివారం ఉదయం గంటలకు గణపతి పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం 5 గంటలకు ఆవాహిత దేవతా హోమం, జలదివాసం, చతుర్వేద పారాయణ, హారతి, తీర్థప్రసాద కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో దర్బార్ మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ అమర్‌సింగ్, ఆలయ ప్రతినిధి సచిన్‌కామ్లెకర్ పాల్గొన్నారు.

వాటర్‌బోర్డు సమస్యలను పరిష్కరిస్తాం



జీఎం జాన్ షరీఫ్‌తో సమావేశమైన ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని వాటర్‌బోర్డు సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని వాటర్‌బోర్డు 4వ డివిజన్ జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీరు, ఇతర వాటర్‌బోర్డు సమస్యలను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ జాన్ షరీఫ్‌తో సమావేశమై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంబంధిత డీజీఎంలు, మేనేజర్లు అన్ని ప్రాంతాల్లో పర్యటించి ఆనంద్‌కుమార్‌గౌడ్ తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తానని వివరించారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే మంత్రి తలసాని దృష్టికి తీసుకువెళ్లి ఆయన సహకారంతో పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి



మోక్షిత్ యాపీల్‌ను ప్రారంభిస్తున్న ఆశీష్‌కుమార్‌యాదవ్

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. టూరిజం, ఐటీ రంగాలతో పాటు ప్రతి రంగాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్నారన్నారు. బేగంబజార్ ఫీల్‌ఖానాలో మోక్షిత్ యాపీల్ సంస్థను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పలు రాష్ట్రాలు కేసీఆర్ ప్రభుత్వ పథకాలను ఆదర్శంగా తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆశీష్‌కుమార్ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు.

కుంకుమార్చన

యాకుత్‌పురా: శ్రావణ మాసం సందర్భంగా యాకుత్‌పురా ఈస్ట్ చంద్రానగర్ మైసమ్మ ఆలయంలో శనివారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి స్థానిక బస్తీ మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించి ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్, టీపీసీసీ కార్యదర్శి నర్సింగ్‌రావు, బీజేవైఎం యాకుత్‌పురా అసెంబ్లీ కన్వీనర్ ఈశ్వర్ యాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

